
# ఘనేరియా వ్యాధి

డి. నాగేశ్వరరావు

“అమ్మా! గుండెచప్పుళ్ళ గుట్టుమట్లు తెలిసినవాణ్ణి. మీవారి గుండె పనితీరు నాకు వింతగా అనిపిస్తోంది. కనుక సిటీకి తీసుకెళ్ళి ఏదైనా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చూపించండి” అంటూ స్టెతస్కోపును సంచిలో వేసుకుంటూ చెప్పేసి చేతులెత్తేశాడు నాటువైద్యుడు నారాయణ.

ఆశ్చర్యంగా చూసింది యాభైయేళ్ళ అనసూయమ్మ. “డాక్టరుగారూ! ఇప్పుడేగా మీరాయనకి ఫర్వాలేదని ధైర్యం చెప్పారు? నాకేదో భయంగా వుంది. నిజం చెప్పరూ?” అంటూ ప్రాధేయపడింది.

“పేషంటు ముందు అలాగే చెప్పాలి. అందుకే నిన్ను బయటికి పిల్చి చెప్తున్నాను. ఏ గుండెకైనా ‘లబ్‌డబ్’ అని కొట్టుకుంటుంది. అది సాధారణం. ఒకోసారి నీరసించిపోయి ‘లబ్బూడబ్బూ’ అని కొట్టుకోవచ్చు. అది అసాధారణం. కానీ ఈయన గుండె ‘డబ్బూడబ్బూ’ అని తెగ మొత్తుకుంటోంది. కనుక ఇది దారుణం. ఇప్పుడు ఏవో ‘చికెన్ గున్యా’ అనీ, మటన్ గున్యా’ అనీ కొత్తకొత్త జబ్బులొస్తున్నాయ్. అంచేత ఈ పేషంటుని నేను చూడకూడదు. నా మాట వినండి” అంటూ పరుగులాంటి నడకతో పారిపోయాడు.



కళ్ళు తుడుచుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లోకి వెళ్ళింది అనసూయమ్మ. ఒక్కగానొక్క కొడుకు సిటీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాని అదెక్కడో ఆమెకి తెలియదు. సాయంత్రమయింది. ఇక లాభంలేదని పక్క వూళ్ళో వున్న ఆమె తమ్ముడు కామేశంకి కబురు చేద్దామని అనుకుంటోంది.

ఇంతలో కట్టెలా మంచాన పడున్న కాసుల పిచ్చయ్య కస్సుమంటూ లేచికూర్చుని, “ఏమే? ఆ డాక్టరుతో ఇంతసేపూ ఏం చెప్పావ్? ఈ వయస్సు వచ్చినా కూడా నేను నిన్ను కట్నంకోసం పీడిస్తున్నానని చెప్పుకున్నావా? నాకేం భయమా? వెళ్ళు. చీకటిపడకముందే నీ పుట్టింటికి పో. రెండు లక్షలు తెస్తేనే కొంపలో కాలు పెట్టు. లేదా అక్కడే పడి చావు” అంటూ ఆమెని మెడపట్టుకుని బయటికి నెట్టేసి తలుపేసుకున్నాడు.

ఏడుస్తూ వరండాలో కూర్చుంది. ఎవరైనా చూస్తారేమోనని సిగ్గుతో ఏడ్చింది. ఇక లాభంలేదని తమ్ముడు కామేశానికి కబురు చేసింది. ఈ వయస్సులో ఈ పాట్లేంటని కుళ్ళికుళ్ళి ఏడుస్తూనే వుంది ఆ రాత్రంతా.

తెల్లతెల్లవారుతుండగా కామేశం పరుగుపరుగున వచ్చాడు. తమ్ముణ్ణి చూడగానే అక్క అనసూయమ్మ బావురుమంది. తమ్ముడూ శృతికలిపాడు. ఎవరైనా వింటే జనం చేరతారని అక్కని ఓదార్చాడు. మెల్లగా ‘అసలేం జరిగింది?’ అని అడిగాడు.

“ఏం చెప్పనురా కాముడూ! నా ఖర్మ. నిన్న ఉదయం వెళ్ళిన మనిషి మధ్యాహ్నం వచ్చారు. వస్తూనే ‘అ’ అంటే అమలాపురం. ‘ఇ’ అంటే ఇచ్ఛాపురం అని పాడుకుంటూ వచ్చారు. హరి హరీ అనటం మినహా మరో పరుషపదం పలికి ఎరుగని ఆయన అలా పాడుతుంటే వినలేక ‘అవేం పిచ్చి పాటలండీ?’ అన్నాన్నా. ఇక అంతేరా – ‘ఒసే ఒసే నావి పిచ్చిపాటలా? నేను పిచ్చోణ్ణా?’ అంటూ నా చెంప పగలగొట్టారు. అంతటితో ఆగారా? ఎంతలేసి మాటలన్నారనీ?

మేనరికం అంటూ నన్నాయన మెడకి చుట్టారట నాన్నగారు. లేకపోతే ఆరోజుల్లోనే ఆయనకి బోలెడు కట్నం వచ్చేదట. ఇప్పుడు నేనేమో కొడుకుతో కుమ్మక్కై ఈయన్ని లెక్కచెయ్యటం లేదట. అవన్నీ అన్నారు సరే. అంటూ అంటూనే స్పృహతప్పినట్టు మంచంమీద పడిపోయారు. కళ్ళు తెరవలేదు.

నాకేదో భయంవేసి ఓ పిల్లాడితో వూళ్ళో వున్న నాటు వైద్యుడ్ని పిలిపించాను. ఆయన

వచ్చి మొహాన ఇన్ని నీళ్ళుచల్లి లేపారు. గుండెను పరీక్షించి నన్ను బయటికి తీసుకెళ్ళి వెంటనే సిటీకి తీసుకుపొమ్మని చెప్పి చక్కా వెళ్ళిపోయారు. నేను ఇంట్లోకి రాగానే ఈయన ఇంతెత్తున లేచి "నీ పుట్టింటికి పోయి, రెండు లక్షలు తెస్తేనే కొంపలో కాలుపెట్టు, లేదంటే అక్కడే పడి చావు" అని నన్ను మెడపట్టుకుని బయటికి నెట్టేసి తలుపేసుకున్నారు. రాత్రంతా అక్కడే పడుకున్నా. సిగ్గుతో చస్తున్నారా. ఎలాగో నువ్వే కాపాడాలిరా కాముడూ!" అంటూ ముక్కు చీదింది అనసూయమ్మ.

వింటూనే నెత్తిన పిడుగు పడ్డట్టు అదిరిపోయాడు కామేశం. "అక్కా! ఆయనే పిచ్చివాగుడు వాగాడని నువ్వేంటిలా? నా పరిస్థితి నీకు తెలియందా? ఇప్పటికిప్పుడు రెండు లక్షలు తెమ్మంటే నేనెక్కడ చావగలను?" అన్నాడు.

అంత బాధలోనూ ఫక్కున నవ్వింది. "ఓరి పిచ్చి సన్నాసీ! నేనన్నది డబ్బు తెమ్మని కాదురా! ఎలాగో ఆయనతో తలుపు తెరిపించి ఆయన్ని కాపాడమని" అంది అనసూయమ్మ.

"ఓ అంతేనా? కాపాట్టానికేగా ఈ కామేశం వచ్చింది. అసలు బావగారు ఎలా వున్నారో చూడనీ' అంటూ కిటికీ తెరవబోయాడు.

"ఒరేయ్! తెల్లవారుఝామున నేనూ ఇలాగే కిటికీ తెరిస్తే 'తూ' అని నా మొహాన ఉమ్మేశారు. జాగ్రత్త" అంటూ తమ్ముణ్ణి హెచ్చరించింది.

"ఓయబ్బో! పైగా ఈ నిర్వాకం కూడానా?" అంటూ ఉత్తరీయం ముసుగేసుకుని కిటికీ తలుపు సగం తెరిచి చూశాడు. చూస్తూనే నోరెళ్ళబెట్టాడు.

"ధనం... ఇంధనం.. శోధనం..మధనం... సాధనం... ఆరాధనం. అన్నింట్లోనూ ధనమే. మరి ఇన్నింట్లో వున్న ధనం నా ఇంట్లో ఎందుకుండదు?" అంటూ శూన్యంలోకి చూస్తూ గోడని అడుగుతున్నాడు కాసుల పిచ్చయ్య.

అది చూడగానే 'బావగారికి పిచ్చిపట్టింది' అని గ్రహించాడు కామేశం. ఏదోఒకగమ్మత్తుచేసి ఆయనతో తలుపు తెరిపించాలని ప్లాను వేశాడు. పిచ్చయ్య "ఎందుకుండదు?" అన్నప్పుడు మాటలో మాట కల్పించుకుని "ఎందుకుండదు బావా?" అన్నాడు.

ఆ మాటతో తిరిగి చూసి "నువ్వటోయ్ కామేశం. రా.. లోపలికి రా!" అంటూ వచ్చి కిటికీ తలుపులు బార్లా తెరిచాడు పిచ్చయ్య.

'ఇంత లావు మనిషిని కిటికీలోంచి రమ్మంటాడేమిటి?' అనుకుని 'ఓహో! పిచ్చిగదూ?' అని సరిపెట్టుకుని – "ఎలా రాను బావా! కాళ్ళకి చెప్పులున్నయ్‌గా? పైగా వచ్చింది నేనొక్కణ్ణేకాదు, మీ ఇంట్లో వుండటానికి ధనం కూడా వచ్చింది. తలుపు తెరిస్తే లోపలికొస్తాం" అంటూ చీకట్లో బాణం వేసినట్టు ప్రయత్నించాడు.

"అలాగా! ధనం కూడా వచ్చిందా? ధనమెవరు?" అని అనుమానంగా చూశాడు పిచ్చయ్య.

"ధనం బావా! నువ్వు కోరుకున్న డబ్బు తెచ్చాను" అన్నాడు ఆశ పెంచుతూ కామేశం.


"తెచ్చావా? మరి చెప్పవేం?" అంటూ వచ్చి వీధి గుమ్మం తెరిచాడు. అదే అదనుగా అనుకుని అమాంతం లోపలికెళ్ళి పిచ్చయ్యని కదలకుండా పట్టుకున్నాడు కామేశం. అనసూయమ్మ కూడా గబగబా లోపలికెళ్ళి తమ్ముడికి సాయపడింది.

సిటీకి తీసుకెళ్ళి ఓ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ అన్ని పరీక్షలూ చేసి నాలుగంకెల బిల్లు వసూలుచేసి "ఈ పేషెంటుకి శారీరకంగా జబ్బేమీ లేదు, ఓ సైకియాట్రిస్ట్‌ని కలవండి" అని చేతులు దులుపుకున్నారు.

సైకియాట్రిస్ట్‌ను కలిశారు. ఆయన కాసుల పిచ్చయ్యని విడిగా కూర్చోబెట్టి ప్రశ్నించి, జవాబులు రాబట్టి రోగ నిర్ధారణ చేశారు.

అక్కా తమ్ముళ్ళనీ, అప్పుడే వచ్చిన పిచ్చయ్య కొడుకునీ తన కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి సైకియాట్రిస్ట్ విషయమంతా వివరంగా చెప్పారు.

"ఈ జబ్బుని మేము 'ధనేరియా వ్యాధి' అని హాస్యంగా పిలుస్తాం. అంటే గనేరియా, మలేరియాల




వంటిది కాదు. అవి రోగిని మాత్రమే బాధిస్తాయి. ఇది రోగినీ, తన కుటుంబాన్నీ, ఇంకా ఇరుగుపొరుగు వారిని కూడా బాధిస్తుంది. తనది కానిదాన్ని సాధించాలనే అత్యాశ ఈ జబ్బు లక్షణం. ఆ తపన పిచ్చిగా మారుతుంది.

ఇక ఈ కాసుల పిచ్చయ్య గారికి ఇది ఎలా వచ్చిందంటే, నిన్న అనుకోకుండా తన బాల్య స్నేహితుడు చిల్లర మల్లయ్య వీరికి కలిశాడు. ఏదో మాటల సందర్భంలో మల్లయ్య కొడుక్కి రెండు లక్షల కట్నం తీసుకుని పెళ్ళి చేశాననీ, మరో సంబంధం రెండు లక్షలు ఇవ్వటానికి సిద్ధంగా వుందనీ, మీరు మీ అబ్బాయికి మాట్లాడమంటే మాట్లాడతాననీ చెప్పాడు. దాంతో పిచ్చయ్యకి ఆశ కలిగింది. వెంటనే కొడుక్కి ఫోన్ చేసి మాట్లాడాడు. కాని కొడుకు ఒప్పుకోలేదు. తనో అమ్మాయిని ప్రేమించాననీ, ఆమెనే పెళ్ళాడతాననీ, అమ్మనైతే నేను ఒప్పిస్తాననీ, మీరు ఒప్పుకుంటే చాలనీ తేల్చి చెప్పాడు.

దాంతో పిచ్చయ్యగారి ఆశ నిరాశయింది. పైగా తల్లీకొడుకులది ఒకటే మాటనీ, అందువల్లనే రెండు లక్షలు చేజారిపోయాయనీ, దీనంతటికి కారణం తల్లి కొడుక్కిచ్చిన చనువేననీ అనుకున్నాడు. నిరాశనుంచి కసి, కసినుంచి అస్థిమితం, దాన్నుంచి పిచ్చి, ఇలా వచ్చిందీ ధనేరియా వ్యాధి

ఒకడు ఏడుస్తున్నప్పుడు అంతకంటే ఎక్కువ ఏడుస్తున్నవాణ్ణి చూస్తే నెమ్మదిస్తాడు. అలాగే ఒక చిన్నదీపం పక్కన పెద్దదీపం వెలిగిస్తే చిన్నదీపం వెలుగు లెక్కలోకి రాదు. కనుక ఈ వ్యాధి నివారణ కోసం నేను చెప్పినట్టు చేయండి" అంటూ చేయవలసింది చెప్పారు సైకియాట్రిస్ట్. అది విని కాసుల పిచ్చయ్యను ఇంటికి తీసుకొచ్చారు.

రెండు రోజుల తర్వాత పిచ్చయ్యగారి బాల్య స్నేహితుడొకరు పరామర్శించడానికి వచ్చాడు. మాటల మధ్య చిల్లర మల్లయ్య కోడలి ప్రస్తావన వచ్చింది. "ఆఁ ఏం కోడలోరా! వాడి కొంప ముంచింది. అది నిన్ననే జరిగింది" అన్నాడు.

"ఏం? ఏమైంది?" అడిగాడు పిచ్చయ్య.

"ఏముంది? కట్నం తెచ్చాననే అహం కోడలికీ, పెత్తనం చేయాలనే వెంపర్లాట అత్తగారికీ పట్టుకుంది. చినికిచినికి గాలివానైనట్టు చిన్నచిన్న మాట పట్టింపులు పెద్ద రభసయింది. దాంతో కోడలు అలిగి పుట్టింటికెళ్ళింది. అలా వెళ్ళిందో లేదో నిన్ననే ఓ పెద్దమనిషిని మధ్యవర్తిగా చేసి రాయబారం పంపింది. నేను రెండు లక్షలు పోసి మీ అబ్బాయిని కొన్నాను. కనుక అతని మీద సర్వాధికారాలూ నాకే వున్నాయి. మర్యాదగా నా భర్తని నా పుట్టింటికి పంపిస్తే బుద్ధిగా కాపురం చేసుకుంటాం, లేదంటే మీరే నాలుగు లక్షలు నాకిచ్చి మీ అబ్బాయిని మీరు కొనుక్కోండి, అదీ కాదంటే మాకు తెలిసిన మ్యాజిక్కులూ లాజిక్కులూ ఉపయోగించి కోర్టుకీడుస్తానంది.

వెంటనే కొడుకు స్పందించి 'అదీ నిజమేగా? డబ్బుకోసం మీరు నన్ను అమ్ముకున్నారు, నేను నా భార్య దగ్గరికే పోవడం న్యాయం. మీకు శక్తివుంటే నన్ను మళ్ళీ కొనుక్కోండి, లేదా మీ చావు మీరు చావండి" అని వాడి పెళ్ళాం దగ్గరకే వాడు పోయాడు" అని కట్నంకథ చెప్పాడు.

మరో రెండు రోజుల తర్వాత కామేశం "మరి నేను బయలుదేరుతున్నా బావా!" అన్నాడు.

"అది సరే... వీడేడి నీ మేనల్లుడు?" అడిగాడు పిచ్చయ్య.

"మీకు కనిపిస్తే కోప్పడతారని తప్పించుకు తిరుగుతున్నాడు. వాడూ ఈరోజో రేపో వెళతాడట"

"తప్పించుకు తిరగటానికి వాడేం తప్పుచేశాడనీ? వాడికి నచ్చినమ్మాయిని ప్రేమించాడు. మధ్య మనకేం?"

"మరి ఆ అమ్మాయి కట్నమదీ ఇచ్చుకోలేదట."

"అక్కర్లేదు. నేను నా కొడుకును అమ్ముకోవడం లేదు. నువ్వెళ్ళి ఆ అమ్మాయి పెద్దవాళ్ళతో మాట్లాడి పెళ్ళికి ఏర్పాట్లు చూడు" అన్నారు పిచ్చయ్యగారు.

అందరూ ఆనందంతో నవ్వుతూ 'శుభం' అన్నారు.

★